క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



కర్లపాలెం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన ఆహార పదార్థాలు అందించాలని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు చెప్పారు. నల్లమోతువారిపాలెం పంచాయతీ పరిధిలోని వెన్నలకంటి నగర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయని పథకం లక్ష్యం నెరవేరే విధంగా పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు.

గ్రామ దేవతలకు ఆషాఢ సారె



కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ ఎంవీరాజుపాలెంలో ఆట్లవారి వంశానికి చెందిన ఆడపడుచులు గ్రామ దేవతలకు ఆషాఢ సారె సమర్పించారు. గురువారం మహిళలు తమ గృహాల నుంచి పసుపు కుంకుమలు, పూలు, పండ్లు నైవేద్యాలు తలపై ఉంచుకుని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆట్లవారి ఇలవేల్పు బురకాయల అంకమ్మ తల్లి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి ఆషాఢ మాస సారెను సమర్పించారు. అలాగే గ్రామంలోని సముద్రాల అంకమ్మతల్లి, రేణుకమ్మ తల్లి, కర్లపాలెం గ్రామ దేవతలైన పెద్దింటమ్మ, కాళికమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించి సారె, నైవేద్యాలను సమర్పించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ అందించాలి

తహసీల్దార్ షాకీర్ షాషా



కర్లపాలెం: చౌకధరల దుకాణ డీలర్లు వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి ఇవ్వాలని తహసీల్దార్ షాకీర్ షాషా ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించాలని చెప్పారు. కార్డుదారులతో సక్రమంగా మెలగాలని సకాలంలో రేషన్ అందజేయాలని అన్నారు. రేషన్ షాపుల వద్ద సరుకుల వివరాలు, రేట్లు తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ షాపు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రేషన్ సరుకుల తూకం సక్రమంగా ఉండాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ ఫణికుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

శాకంబరిగా మోదుకూరు కనకదుర్గమ్మ



చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో గురువారం అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించి, కానుకలు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏవో కె.శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. తెనాలి మేరా యువ భారత్, సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్, అధ్యాపకులు గేరా రాజు, తన్నీరు శివశంకర్, బి.దమోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారు

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



పెనుగుదురుపాడులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని పెనుగుదురుపాడు, కేఎస్‌పల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మోసాల గురించి వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నపుడు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వమే ప్రతి ఏడాది బీమా చెల్లించడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు, కౌలు రైతులు ఎకరానికి బీమా ప్రీమియం రూ.800 చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారని, రైతులపై భారం వేసారని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి, గ్రామ సర్పంచ్ అగ్గిరేకులు నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కోటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు రంగారావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, పిల్లి వెంకటేశ్వర్లు, పిల్లి బుజ్జి, ముక్కొంటి, రవిశంకర్ రెడ్డి, కొండా రెడ్డి, తోట హరిశంకరరావు, బాలాజీ, తుమా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఆవేదనలే కనిపిస్తున్నాయి

మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ప్రజా ఆవేదనలే స్పష్టంగా కనిపిస్తున్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నందిరాజుతోటలో కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో పథకాలు తీసుకువచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరికే దక్కుతుందన్నారు. అర్హతే ఆధారంగా అన్ని పథకాలను నేరుగా ఇంటి వద్దనే అందించిన ప్రభుత్వాన్ని చూసిన ప్రజలు ఇప్పుడు బాబు మోసాల ప్రభుత్వంతో విసుగుచెందారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల్లో అరకొరగా చేస్తే చెప్పుకునేందుకైనా ఆ పార్టీకి అవకాశం ఉండేదని, మా నాయకుడు ఇది చేశారని చెప్పుకోలేని పరిస్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. ప్రజాదరణ కలిగిన వైఎస్సార్‌సీపీ కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు వంద పనులు చేసుకుందామని కోన భరోసా ఇచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని, ప్రజల వెంటే ఉంటామని తెలిపారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా భారీ జన సందోహం ఉండటమే పార్టీకి ఉన్న అండ అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలు, పీటా వేణుగోపాల్, మోర్ల సముద్రాలగౌడ్, వడ్డిముక్కల డేవిడ్, పిన్నిబోయిన ప్రసాద్, నక్కా వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతల్లో నీళ్లు.. ప్రజల అవస్థలు

- చుండూరు మండలంలో అధ్వానంగా లింక్ రోడ్ల పరిస్థితి
- కూటమి ప్రభుత్వం రోడ్లను పట్టించుకోవడంలేదని ప్రజల ఆవేదన
- వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్న వైనం



కారుమూరిపాలెం నుంచి మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

వేమూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో రోడ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టి 13 నెలలు అవుతున్నా రోడ్లు గురించి పట్టించుకోక పోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండలంలోని గుంతల రోడ్ల వల్ల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు నానా బాధలు పడుతున్నారు. విద్యార్థులే కాదు ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే ఆ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కారుమూరుపాలెం నుంచి మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 10 మంది విద్యార్థులు పాఠశాలకు వెళుతున్నారు. వర్షం పడితే రోడ్ల గుంతల్లో నీరు పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు, ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు కనీసం నడవడానికి కూడా నరకం చూస్తున్నారు. చినగాదెలవర్రు గ్రామంలోని విద్యార్థులు చినపరిమి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళుతున్నారు. పెదగాదెలవర్రు గ్రామానికి చెందిన విద్యార్థులు చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళుతున్నారు. వర్షాకాలం వస్తే రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

గ్రామాల్లో లింక్ రోడ్లు వేయాలి

కూటమి ప్రభుత్వం గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లు వేస్తారని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయడం జరిగిందని ప్రజలు అంటున్నారు. చుండూరు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల లింక్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ఇంత వరకు రోడ్లు వేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, రోడ్లపై వెళ్లటానికి చాలా కష్టంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం త్వరితగతిన లింక్ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం రోడ్లు వేయాలి



మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా అబ్బాయి 5వ తరగతి చదువుతున్నాడు. వర్షాల సమయంలో రోడ్లు గుంతల్లో వెళ్లడం కష్టంగా ఉంది. ప్రభుత్వం రోడ్లు వేయాలి.

– మేరుగోలు బుజ్జిబాబు, కారుమూరివారిపాలెం, చుండూరు మండలం

ఏడాది గడిచినా రోడ్లు వేయలేదు



కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరు నెలల్లో రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఏడాది గడిచినా రోడ్లు వేయలేదు. రోడ్లు వేయలేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్లు వేయాలి.

– అంజి రెడ్డి కారుమూరిపాలెం, చుండూరు మండలం

పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



కాల్వల్లో స్ప్రే చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రేపల్లె: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని పలు వార్డులలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను గురువారం ఆయన పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రధాన రహదారులు, ప్రధాన మురుగు కాల్వలే కాకుండా అంతర్గత రహదారులు, కాల్వలను సైతం నిరంతరం శుభ్ర పరుస్తున్నారన్నారు. అవసరమైన ప్రదేశాలలో బ్లీచింగ్ పిచికారీ చేయిస్తున్నామన్నారు. కాల్వల్లో సిల్ట్ తొలగించటంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఎబెట్ ఆయిల్‌ను స్ప్రే చేయిస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. తమ గృహాల వెంబడి వచ్చే వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాలలో గానీ, పారిశుద్ధ్య సిబ్బందికి గానీ అందించాలని, కాల్వల్లో పడవేయరాదని సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులలో యాంటీ లార్వల్ ఆయిల్‌ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు సురేంద్ర, నాగమల్లేశ్వరరావు, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి, వైఎస్సార్‌సీపీ జెండాకు టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు దారుణం

వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



పెనుగుదురుపాడులో వైఎస్సార్ విగ్రహానికి, వైఎస్సార్‌సీపీ జెండాకు ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీ

చుండూరు(వేమూరు) : చుండూరు మండలంలోని పెనుగుదురుపాడు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి, వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెకు, టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చాల దారుణం అని వైఎస్సార్‌సీపీ వేమూరు సమన్వయకర్త వరకూటి అశోక్‌బాబు అన్నారు. ఈ నెల 17వ తేదీన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడ అనిత పెనుగుదురుపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనగా, ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి, వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెకు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజల మధ్య గొడవలు పెట్టడానికే టీడీపీ నాయకులు ఇలాంటి పనులు చేయడం జరుగుతుందన్నారు. దీనిపై పోలీసులతో మాట్లాడి ఫ్లెక్సీని తొలగించాలని ఆయన కోరారు.

జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రేపల్లె: సామాజిక ప్రయోజనం కోసం, సమాజంలో మూఢాచారాలను పారదోలటం కోసం జాషువా సాహిత్య కృషి ఎనలేనిదని న్యాయవాది దారం సాంబశివరావు అన్నారు. నవయువ చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన రచనల ద్వారా అంటరానితనం, అస్పృశ్యతలపై తిరగబడిన సామాజికవేత్తని కొనియాడారు. సామాజిక స్పృహ కలిగించేందుకు గబ్బిలం, ఫిరదౌసి, బాపూజీ, గిజ్జిగాడు, కోకిల వంటి అనేక రచనలు చేశారన్నారు. శాసనమండలి సభ్యునిగా పనిచేశారని పేర్కొన్నారు. ఆయన రచనలకు కేంద్ర సాహిత్య అకాడమీ, పద్మభూషణ్ పురస్కారాలతో పాటు కళాప్రపూర్ణ బిరుదును పొందారని గుర్తుచేశారు. జాషువాను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికై కృషి చేయాలన్నారు. అనంతరం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చందోలు దేవదాసు, మాజీ కౌన్సిలర్ జూలకంటి బుజ్జిబాబు, ఉపాధ్యాయులు రెడ్డియ్య, నరేష్ బాబు, మోహనరావు, సుబ్బారావు, రాజారత్నం, రవి, బాబూరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను భారం కాదు బాధ్యత

ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్

తెనాలి: ఆదాయ పన్ను చెల్లింపును భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, సకాలంలో చెల్లిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆదాయ పన్ను శాఖ, తెనాలి అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ సూచించారు. జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూనికేతన్ జూనియర్ కాలేజీలో గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సుకు కాలేజీ ఎండీ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. కిషోర్ కుమార్ మాట్లాడుతూ దేశంలో తొలిసారి ఆదాయ పన్ను విధించిన జులై 24న ఏటా ఆదాయపన్ను దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వం 1860 జులై 24న ఆదాయ పన్ను చట్టం తీసకొచ్చిందని, అనేక సవరణల అనంతరం భారత ప్రభుత్వం 1961లో చేసిన చట్టమే అమలులో ఉందన్నారు. ఆదాయ పన్ను చెల్లింపునకు సంబంధించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. ఆదాయ పన్ను కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు టి.శంకరరావు, పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సాయిరేవతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జన సురక్ష పథకం కుటుంబాలకు ఆర్థిక భద్రత

ఎల్‌డీఎం శివకృష్ణ



మాట్లాడుతున్న ఎల్‌డీఎం శివకృష్ణ

బాపట్ల అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జన సురక్ష పథకం ఖాతాదారుల కుటుంబాలకు ఆర్థిక భద్రత ఇస్తోందని ఎల్‌డీఎం శివకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో యూనియన్ బ్యాంక్ వెదుళ్లపల్లి బ్యాంక్ మేనేజర్ విజయ్ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంపెయిన్ గురువారం నిర్వహించారు. ఎల్‌డీఎం శివకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనసురక్ష పథకంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు వారికి పీఎంఎస్‌బీవై ద్వారా రూ.20కే ప్రమాద బీమా అందిస్తున్నామన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వారికి పీఎంజేజేబీవై ద్వారా రూ.436కు సహజ మరణం బీమా అందిస్తున్నామన్నారు. బ్యాంక్‌లో ఖాతా లేని ప్రతి ఒక్కరూ జన్‌ధన్ ఖాతా తీసుకోవాలన్నారు. అదే విధంగా 18 నుంచి 40 సంవత్సరాల వారికి అటల్ పెన్షన్ యోజన ఉందని, ఈ పథకంలో 60 సంవత్సరాల తరువాత పెన్షన్ రూపంలో నగదు అందుతుందని తెలిపారు. మేనేజర్ మానస మాట్లాడుతూ ఖాతాలు ఎల్లవేళలా సక్రమంగా పని చేయాలి అంటే ఎల్లపుడు ఖాతాను వాడుతూనే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వెదుళ్లపల్లి బ్యాంక్ మేనేజర్ విజయ్ సందీప్‌కుమార్, ఉదయమ్, బి.సి.రత్నం తదితరులు ఉన్నారు.

మోటార్ల దొంగ అరెస్ట్



చోరీ సొత్తు రికవరీ చేస్తున్న పోలీసులు

తెనాలిరూరల్: మోటార్లు, పంపుల హ్యాండిళ్లను చోరీ చేస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె. ఆనంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం, రైతు భరోసా కేంద్రం, శ్మశాన వాటిక, ఇతర ప్రదేశాల్లోని మోటార్లు, పంపుల హ్యాండిళ్లు కొంత కాలంగా చోరీకి గురవుతున్నాయి. దీనిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని సంగంజాగర్లమూడి గ్రామానికే చెందిన చిట్టిబోయిన పవన్‌గోపీ అలియాస్ బాబుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి వివరాలు సేకరించి చోరీకి గురైన సొత్తును స్వాధీనపర్చుకున్నారు. కోర్టులో గురువారం హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు బుక్స్, మొక్కలు పంపిణీ

తెనాలిఅర్బన్: విద్యార్థులు విద్యలో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి వేజళ్ళ వెంకట సుబ్బారావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బీసీ కాలనీలోని వేజళ్ళ వెంకట సుబ్బారావు స్పెషల్ పురపాలక పాఠశాలలోని విద్యార్థులకు వ్రాత, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ క్రేయన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు స్మారక విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలను 2017లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు, గుడ్డ సంచులు, మొక్కలు, దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓంకారప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఉపాధ్యాయులు పద్మజ, నాగేంద్రబాబు, మమత, ట్రస్ట్ సభ్యులు శ్రీదేవి, బి.శివరామకృష్ణ, వేజళ్ళ ఝాన్సీలక్ష్మీ, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

బాపట్లలో కేబుల్ వార్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

బాపట్ల: బీసీటీ కేబుల్ యాజమాన్యం నియంత ధోరణి అదుపు చెయ్యాలని ఏసీటీ (యాక్ట్) నెట్‌వర్క్ కార్మిక సంఘం నాయకుడు విన్నకోట వీరయ్య నాయుడు డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణం కేబుల్ నెట్‌వర్క్ ప్రసారాలకు అంతరాయం కలిగించేలా బీసీటీ కేబుల్ నెట్‌వర్క్ యాజమాన్యం చేస్తున్న దుశ్చర్యలను ఖండిస్తూ ఏసీటీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీటీ నెట్‌వర్క్ కార్మిక సంఘం నాయకుడు విన్నకోట వీరయ్య నాయుడు మాట్లాడుతూ పట్టణంలో గత 40 సంవత్సరాలుగా కేబుల్ ప్రసారాలు వివిధ నెట్‌వర్క్‌ల ద్వారా నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రసారాలను అందిస్తూ పనిచేశామన్నారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల కేబుల్ టెలివిజన్ యాజమాన్యం ఏసీటీ కేబుల్ టెలివిజన్ ప్రసార వైర్లను తొలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రాజకీయ నాయకుడి అండదండలతో దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వారి నియంత ధోరణిని అరికట్టాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్‌కు అర్జీ అందించారు. ఈ నిరసన ర్యాలీలో పట్టణ మండల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పట్టణవాసులకు ఇబ్బంది రానివ్వకండి



సూచనలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు



3వ వార్డులో కాల్వలను పరిశీలిస్తున్న ఆరోగ్యాధికారి యేసుబాబు

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీఎం.లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పూలేకాలనీలో గురువారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షపునీరు రోడ్లపై నిల్వలేకుండా చూడాలని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. అనంతరం ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, సిబ్బంది ఉన్నారు. 3వ వార్డులో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని, కాల్వల్లో వ్యర్థాలు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.